

# స్నేహితుడి భార్య

కొడవటిగంటి కుటుంబరావు

"నేను సినిమాకు పోతున్నాను"

అన్నాడు మొగుడు.

"ఈ సినిమా ఏమిటో నాకు తెలుసు!' అనుకున్నది భార్య. "నేనుకూడా రానా?" అన్నది.

"ఆ! మంచిసినిమా కాదు, నిద్ర పట్టక పోతున్నాగాని."

'ఈ నిద్రపట్టకపోవటమూ నాకు తెలుసు!' అనుకున్నది భార్య.

ఇవ్వాళ ఎనిమిదిన్నర పాసెంజరుకు ప్రసాదరావు బెజవాడ వెళ్ళాడు. ఇంటి దగ్గిర నీలవేణి ఒంటరిగా ఉంటుంది. అయ్యగారు తొమ్మిదింటికే సినిమావంక పెట్టి వెంచేస్తున్నారు!

ఎట్లాచేస్తారో మగవాళ్ళింత దుర్మార్గం? తన స్నేహితుడి భార్య కదా?

వాళ్ళిద్దరికీ—తన భర్తకూ, నీలవేణికి,—ఏదో సంబంధం ఉండవచ్చునని ఇవాళ ఉదయమే తనకు అనుమానం పోవడమూ, ఆ అనుమానం కాస్తా ఇప్పుడే రుజువుకావడమూనూ!

నిజానికి తన భర్తకంటే ప్రసాదరావు ఎన్నోరెట్లు అందగాడు. అతనిమీద తనకు ఎన్నిసార్లు బుద్ధిపోలేదు! తను తూలిందా?

నీలవేణి-పేరు 'నాజూకేగాని-తనకంటే ఏ విధంగా అందకత్తె! తలుచుకున్నకొద్దీ మండిపోతున్నది!...ఈ పాటికి తన భర్త ప్రసాదరావుగారింటికి నగందూరంలో ఉంటాడు...ఆమె చివాలున లేచింది. దీపంతగ్గించి, తలుపులన్నీ దగ్గరగా వేసి బయటికొచ్చింది. బయటి తలుపు గొళ్ళెంపెట్టి ప్రసాదరావుగారింటికేసి బయలుదేరింది.

ఆటే దూరంలేదు. అదే ప్రసాదరావుగారిల్లు. తన భర్త జాడ ఎక్కడాలేదు. రోడ్డు లాంతర్లున్నచోట తప్ప అంతా చీకటి. అంతా నిశ్శబ్దం. చలికాలం కావటం మూలాన రోడ్డుమీద ఒక్కపురుగు లేదు, తొమ్మిదింటికే.

ఎదురుగా ఎవరో వస్తున్నారు, ఆమె గుండె గుబుక్కుమన్నది. అమ్మో! ప్రసాదరావు! రైలుకు పోనేలేదు.

ఇంటికి తిరిగి వస్తున్నాడు! పెళ్ళాం రహస్యం తెలిసిందో ఏమో!

అతన్ని లోపలికి వెళ్ళనివ్వరాదు. కొంప పోతుంది.

ఆమె నాలు గడుగులు ముందుకు నడిచి ప్రసాదరావును సమీపించింది.

ప్రసాదరావు నిర్ఘాంతపోయినాడు.

"ఏమమ్మా ఎవరికోసం? ఎక్కడికి?" అన్నాడు అతను. తను నవ్వింది. ఇంకా నయం, నవ్వగలిగింది.

"మీకోసమే!" అంది తరువాత అతనేమనుకున్నా సరే!

"నా కోసమా! నా ప్రయాణం ఆగిపోయిందని ఎట్లా తెలిసింది?"

"మీరు కూడా ప్రయాణమైనారని నాకు తెలీదు."

"పోనివ్వండి, నాతో ఇప్పుడేంపని!"

"మీతో ఒక అరగంటసేపు రహస్యంగా మాట్లాడాలి."

అతను నమ్మటంలేదు. "మా గొడ్ల పాకలో కూర్చుందామా?"

తను సరే నన్నది.

అతను ఒక నులకమంచం వాల్చి "కూచోండి!" అన్నాడు.

తను కూచుని అతని చెయ్యిపట్టుకు బలవంతాన కూచోపెట్టింది. అతనికి అర్థమయింది.

"ఈ ఆలోచన ఎంతకాలంనుంచి?" అన్నాడతను దగ్గరికి జరిగి.

"మనం చాలా తప్పు చెయ్యబోతున్నాం. నాకు నీమీద ఎంతకాలంనించో ఉంది. స్నేహితుడి భార్యవని చంపుకున్నాను.........అదీకాక మా ఆవిడంటే నాకు చాలా గౌరవం.'

"మీ ఆవిడ! అయ్యోరాత!!" అనుకుంది తను.

"ఈ వెధవ గొడ్లపాకా ఏమిటి? మనం మీ యింటికి పోదాం?" అన్నాడతను.

"మా యింటికా? వద్దు!"

"ఏం మీ ఆయన ఇంట్లో లేడుగా!"

ఆమె చివాలున లేచింది. ఇతనికంతా తెలుసు. తను నిష్కారణంగా శీలం చెడగొట్టుకున్నది.

"ఎట్లా తెలుసు?" అన్నది వణుకుతున్న గొంతుతో.

"వాడు సినిమాకు వెళుతూ దారిలో నాక్కనిపించాడే!"

తను ఇక అక్కడ ఒక్క క్షణం ఉండలేదు, పరిగెత్తింది. వెనకనించి దయ్యాలూ, భూతాలూ తరుముకొస్తున్నట్లు పరిగెత్తి కడప్రాణంతో వచ్చి కొంపలోపడి తలుపు బిడాయించుకున్నది.

